క్లుప్తంగా

సచివాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామ సచివాలయాన్ని ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, వారికి అవసరమైన సేవలందించాలని సూచించారు. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు ప్రశంస



ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అబ్దుల్ హమీద్

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్‌కు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేసి, సత్కరించారు. తాడేపల్లిలో మంగళవారం సాయంత్రం జరిగిన పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఆయనకు ఈ గౌరవం దక్కింది. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ సత్కారం చేశారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంల వినియోగం తెలుపుతున్న తహసీల్దార్ రాజు

రాజాం సిటీ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎంల వినియోగంపై రాజాం పట్టణ, మండలంలోని అన్ని పార్టీల రాజకీయ నాయకులకు మంగళవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ రాజు మోడల్ ఈవీఎంలు తీసుకువచ్చి, ఓటు వేసే విధానాన్ని వారికి తెలిపారు. దీనిపై గ్రామాల్లో కూడా అవగాహన కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఈవీఎంల పనితీరు, ఓటింగ్‌పై ఎటువంటి అపోహలు లేకుండా ఉండేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ ప్రకాష్, సీఎస్‌డీటీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం



పూజలందుకుంటున్న కాశీవిశ్వేశ్వరుడు

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి అన్నాభిషేకం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో 4 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



స్వామీజీకి బొబ్బిలి వీణ బహూకరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని శ్రీకళాభారతిలో ఏర్పాటు చేసిన అరుణాచల రుద్రాక్ష స్వామీజీ ప్రవచన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం, ముక్తి, మోక్షం లభిస్తాయన్నారు. అనంతరం స్వామీజీకి బొబ్బిలి వీణను ఎమ్మెల్యే బహూకరించి, సత్కరించారు. కార్య క్రమంలో వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

మేలు జరిగిందంటేనే ఓటేయండి



రాజాం: పాగిరిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంతో గ్రామాలు జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు మంగళవారం ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లగా జగనన్న సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు అని, గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటేసి, గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్



వంగర: మద్దువలసలో సంక్షేమ పథకాల బోర్డు ప్రారంభించిన ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు, తదితరులు



రాజాం: బొద్దాంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింహులు, వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు



సంతకవిటి: తలతంపర సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డు



తెర్లాం: చుక్కవలసలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



రేగిడి: మునకలవలసలో పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహనరావు తదితరులు



బొబ్బిలి: పెంట గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు, తదితరులు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని చిన్న జగన్నాథపురంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకే ఓ వైపు ప్రాంతాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అన్ని వర్గాల్లోని ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. గ్రామస్వరాజ్యం సాధనే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. మళ్లీ మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని జనం చూస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరిన్ని సీట్లతో వైఎస్సార్ సీపీకి భారీ విజయం అందించి, అధికారం అప్పగించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, జగన్నాథపురం సర్పంచ్ బొద్దల పద్మాసత్యనారాయణ, కృష్ణాపురం సర్పంచ్ గంట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చాలి

- ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: గ్రామ పంచాయతీ పరిధిలోని వనరులను వినియోగించుకుని, పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులంతా ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచిస్తూనే పంచాయతీ పాలకవర్గంలో సమావేశాలు ఏ విధంగా నిర్వహించాలో తెలిపారు. పంచాయతీల్లో ఏదైనా కోర్టు కేసులు నమోదైతే వాటికి సంబంధించిన అన్ని వివరాలు సమగ్రంగా తయారు చేసుకుని, ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీరావు

బొబ్బిలి: విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించాలని డిప్యూటీ డీఈవో పి.బ్రహ్మాజీరావు అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో డివిజన్‌లోని 10 మండలాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశమైన ఆయన నాణ్యమైన విద్యనందించాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని, పరిశోధనాత్మక అంశాలు విద్యార్థులకు తెలియజేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

చోడి సాగుపై ఆసక్తి కనబరచాలి



కొత్తపెంట గ్రామంలో చోడిసాగును పరిశీలిస్తున్న ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి: చోడి సాగుపై రైతులు ఆసక్తి కనబరచాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. మండలంలోని మెట్టవలస, కొత్తపెంట గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన అంతర పంటలు, వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించారు. వీలైనంత వరకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న చోడిపంట సాగుకు రైతులు ముందుకురావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: మండల కేంద్రంలోని పలు ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. విద్యుత్ లైన్లు సరిచేయడంతో పాటు విద్యుత్ తీగలపై పడిన కొమ్మలను తొలగించడం వంటి పనుల నేపథ్యంలో మహరాజుపేట, దాసరివీధి, పూల్‌భాగ్ ఏరియా, అగ్రహారం, రావువారి వీధి, సింగారపు వీధి, యాదవ వీధి, ఎరుకల వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పంటకోత ప్రయోగం



లక్ష్మీపురంలో పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వరి పొలాల్లో పంటకోత ప్రయోగం మంగళవారం నిర్వహించారు. ఏవో శిరీష మాట్లాడుతూ ఇప్పటివరకు 55 పంటకోత ప్రయోగాలు చేశామని, ఎకరాకు 22 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి వస్తాయన్నారు. పాల్తేరులో ధాన్యం కొనుగోలు జరుగుతోందని, రేజేరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



దీపాలతో భక్తులు తీర్చిదిద్దిన ఏనుగు ఆకారం

రాజాం: స్థానిక సంతమార్కెట్ వద్ద ఉన్న మల్లిఖార్జునస్వామి ఆలయంలో దీపారాధన మంగళవారం నిర్వహించారు. దీపాలతో రూపొందించిన గణనాథుడు, ఆంజనేయుని గద, ఓంకారం, స్వస్తిక్, ఏనుగు తదితర ఆకారాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



బొబ్బిలి: ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు



బాడంగి: వ్యాయామ ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు



రాజాం: ఆడుదాం ఆంధ్రా కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

బాడంగి: గ్రామీణ క్రీడాకారుల్లోని క్రీడానైపుణ్యాలు వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహించే వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశమైన ఆయన ఎక్కడ, ఏ విధంగా క్రీడలు నిర్వహిస్తారన్న విషయాలపై ఆరాతీశారు. మండలంలోని 18 సచివాలయాల్లో 4,400 మంది క్రీడాకారులు ఆటలు ఆడేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. క్రీడాకారుల పేర్లు నమోదుకు మరో రెండు రోజుల మాత్రమే గడువు ఉందని, మహిళా క్రీడాకారులు కూడా కార్యక్రమంలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో–2 రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఫిబ్రవరి 28 వరకు..

బొబ్బిలి: మండల కేంద్రంలో 16 సచివాలయాల సిబ్బందికి ఆడుదాం ఆంధ్రా కిట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, లాంగ్‌జంప్, హైజంప్, బాస్కెట్ బాల్, కబడ్డీ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన యువతీ, యువకులు క్రీడల్లో పాల్గొని, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు చెలికాని మురళీకృష్ణారావు, రమాదేవి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 10 గంటల నుంచి..

సంతకవిటి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

రాజాం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన గ్రామసచివాలయాల స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. పంచాయతీల్లోని ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు ఈ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ నాగరాజు చేతులమీదుగా వీటిని వార్డు సచివాలయాల అడ్మిన్‌లకు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండల కేంద్రంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ కిరణ్‌కుమార్, ఐసీఆర్‌పీలు రమణ, తవిటినాయుడు కలిసి, ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభిస్తూ వ్యవసాయం చేస్తే ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కొమెరలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం గోవిందరావు ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని కొమెర గ్రామంలో స్వయం శక్తి సంఘాల మహిళలతో సమావేశమైన ఆయన ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. తీసుకున్న రుణాలు ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. ప్రతీ సంఘంలోని మహిళ ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు.

రేగిడి: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఉనుకూరు గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ సుధీర్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉనుకూరులో రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశమైన ఆయన సంఘాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు



వంగర: రైస్‌మిల్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఐజాక్, ఏవో కన్నబాబు

వంగర: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు తహసీల్దార్ డి.ఐజాక్, ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎం.సీ తారాంపురం గ్రామ రైస్‌మిల్లును పరిశీలించిన వారు మండలంలో వీవీఆర్‌పేట, రాజులగుమ్మడ, తలగాం, కొప్పరవలస, వంగర, మరువాడ, అరసాడ, బాగెంపేట రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం అమ్మకానికి సిద్ధమైన వారు రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం శాంపిల్స్‌ను తీసుకువెళ్లి, కొనుగోలుకు అనుమతి పొందాలన్నారు. ఏ–గ్రేడు రకం క్వింటా ధాన్యం ధర రూ.2,203, 80 కేజీల ఏ–గ్రేడు రకం ధాన్యం ధర రూ.1762, కామన్ రకానికి క్వింటాకు ధర రూ.2183, 80 కేజీల ధర రూ.1746 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందన్నారు.

తెర్లాం: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైస్‌మిల్లర్లు చూడాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశమైన ఆయన ప్రభుత్వ నియమ,నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యాన్ని ఏ రైస్‌మిల్లుకు కేటాయిస్తే ఆ రైస్‌మిల్లర్లు వాటిని సకాలంలో తీసుకోవాలని తెలిపారు.

జాగ్రత్తలతో కుష్టువ్యాధి నివారణ



కుష్టురోగులకు వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వాడాడ పీహెచ్‌సీ సిబ్బంది

బాడంగి: తగిన జాగ్రత్తలు తీసుకుంటే కుష్టు వ్యాధి నివారణ సాధ్యమని డీపీఎంవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని వాడాడ పీహెచ్‌సీ వద్దకు పలువురు కుష్టురోగులను తెప్పించి, వారికి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. వ్యాధిగ్రస్తుల కాళ్లను టబ్బు నీటిలో ఉంచి, చేపట్టాల్సిన చర్యలు తెలిపారు. ఇంటి దగ్గర ప్రతిరోజూ ఇలా చేసుకోవడం ద్వారా కాళ్లకు ఉన్న పుండ్లు తగ్గుతాయన్నారు. అనంతరం రోగులకు ప్లాస్టిక్ టబ్బులు, మెడికల్ కిట్లు, చెప్పులు పంపిణీ చేశారు.